సాక్షి
హనుమకొండ

శుక్రవారం । 22 । మార్చి । 2024



అర్హుల ఆనందహేళ..
టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో గృహజ్యోతి ద్వారా మొదటి విడతలో 19 లక్షల 70వేల మంది రూ.55.55 కోట్ల మేర లబ్ధి పొందారు. - 8లో▸



చీట్‌ఫండ్.. - 8లో▸
ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్‌ఫండ్ నిర్వాహకులు దారి మళ్లిస్తున్నారు. డబ్బును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
$37^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



హన్మకొండ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ, మీడియా సెంటర్లను గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది తోపాటు సెంటర్లలోని వసతులపై ఐఅండ్‌పీఆర్ ఏడీ జీవీ భానుప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి ఇప్పటివరకు ఏమైనా ఫిర్యాదులు అందాయా అని ఆరా తీశారు. ఫిర్యాదుల సమాచార నివేదిక ఎప్పటికప్పుడు ఎన్నికల విభాగానికి అందించాలని సూచించారు.

ఎర్త్ అవర్‌లో భాగస్వాములు కావాలి

కాజీపేట అర్బన్: ఈనెల 23న నిర్వహించనున్న ప్రపంచ ఎర్త్ అవర్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హనుమకొండ అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎర్త్ అవర్ వాల్ పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమిపై జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని, ప్రపంచ ఎర్త్ అవర్‌లో భాగంగా ఈనెల 23న రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ పరికరాలను స్విచ్ఛాఫ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాకేష్, వెంకటేశ్వర్‌రావు, కీర్తి వివేక్, అభినవ్‌కాంబ్లే, దీపిక పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



హన్మకొండ అర్బన్: ఎన్నికల్లో అర్హులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చైతన్యపర్చాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో స్వీప్ ఆద్వర్యంలో వివిధ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అపార్ట్‌మెంట్ అధ్యక్షులతో ఓటరు చైతన్య కార్యక్రమాలపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఓ, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీరమాకాంత్, డీఆర్‌ఓ వై.వి గణేష్, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎంహెచ్‌ఓ సాంబశివ రావు, మెప్మా పీడీ భద్రునాయక్, డీడబ్ల్యూఓ మధురిమ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13మంది విద్యార్థుల గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో గురువారం 68 కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 13మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తంగా 11,992మందికిగాను 11,979మంది (99.89శాతం) హాజరైనట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఏసీజీ చలపతిరావు తెలిపారు. ప్రైవేట్ అభ్యర్థులు 12మందికిగాను 9మంది (75శాతం) పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక పరీక్ష కేంద్రాన్ని, ట్రైనీ కలెక్టర్ ఒకటి, జిల్లాపరిశీలకులు ఐదు, డీఈఓ, ఏసీజీ కలిసి 9 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 28 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

వరంగల్ జిల్లాలో 17 మంది..
కాశిబుగ్గ సెంటర్ : వరంగల్ జిల్లాలో గురువారం నిర్వహించిన టెన్త్ ఇంగ్లిష్ పరీక్షకు 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. మొత్తం 9,448 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 9,431 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

టెండర్.. నో ‘ఆన్సర్’!

తక్కువ కోట్ చేసినా రద్దు చేయడంపై స్పష్టత ఇవ్వని అధికారులు

- కేయూలో యూజీ, పీజీ ఆన్సర్ షీట్ల డిజిటలైజేషన్ ఈ- టెండర్
- అర్హత సాధించిన మూడు సంస్థలు.. తక్కువ కోట్ చేసిన ఓ సంస్థ
- ఆ సంస్థ టెండర్ రద్దు చేసి.. మళ్లీ షార్ట్ టెండర్ నోటిఫికేషన్
- సీఎం రేవంత్‌కు ఫిర్యాదు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ(కేయూ)లో యూజీ(డిగ్రీ), పీజీ విద్యార్థుల పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌స్క్రీన్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ టెండర్‌లో గోల్‌మాల్ జరిగిందా.. తక్కువ కోట్ చేసిన కంపెనీకి ఖరారు చేయకుండా రద్దు చేసి మళ్లీ షార్ట్‌టెండర్ నిర్వహించడంలో ఆంతర్యమేమిటి..? ఎప్పుడూ లేనిది ఐదేళ్లకు ఒకేసారి ఇవ్వడం ఏమిటి? ఇందులో ఎవరి వాటా ఎంతనేది ముందే నిర్ణయించుకుని అనుకున్న వారి(కంపెనీ)కి టెండర్ దక్కే అవకాశం లేకపోవడంతోనే ఈ విధంగా చేశారా.. అంటే యూనివర్సిటీ వర్గాలనుంచి అవుననే సమాధానం వస్తోంది.

కేయూ యూజీ, పీజీ నాన్ ప్రొఫెషనల్, ప్రొఫెషనల్ కోర్సుల జవాబుపత్రాలను ఆన్‌స్క్రీన్ ఆన్సర్ స్క్రిప్ట్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ కోసం పరీక్షల విభాగం అధికారులు గత ఫిబ్రవరి 22న ఈ–టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నెల 6 వరకు ఆన్‌లైన్‌లోనే టెండర్లు స్వీకరించారు. 13న ఓపెన్ చేశారు. నాలుగు కంపెనీలు టెండర్‌లు దాఖలు చేయగా, అందులో అర్హతలు లేవని ఓ కంపెనీని పక్కనపెట్టారు. మిగతా మూడింటిలో ఓ సంస్థ తక్కువగా కోట్ చేసింది. అయినా టెండర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి షార్ట్‌టెండర్ పిలవడంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి.

సీఎం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు

టెండర్ రద్దుపై తక్కువ బిడ్ వేసిన సంస్థ ప్రతినిధి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి, చీఫ్ సెక్రటరీ, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తాము తక్కువ కోట్ చేసి మొదటిస్థానంలో ఉన్నప్పటికి రద్దుచేసి మళ్లీ షార్ట్ టెండర్‌ను పిలిచారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

ఇదిలా ఉంటే రెండోసారి ఇచ్చిన షార్ట్ టెండర్‌కు నాలుగు రోజుల సమయం మాత్రమే ఇవ్వడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల కమిషన్‌కు లేఖ..

రెండోసారి షార్ట్‌టెండర్‌ను ఈ నెల 16న ఇచ్చి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీనిని ఓపెన్ చేయాలంటే ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో యూనివర్సిటీ అధికారులు అనుమతికోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్లు సమాచారం. అనుమతి వచ్చాక బిడ్‌ను తెరవనున్నారు.

ఒకేసారి ఐదేళ్లకు ఇవ్వడమేమిటీ!

టెండర్ కాలపరిమితి ఒకేసారి ఐదేళ్లపాటు ఇవ్వడంలో ఆంతర్యమేమిటి అనే ప్రశ్న తలెత్తుతోంది. వాస్తవంగా ఏడాదిపాటు ఇచ్చి ఆ సంస్థ పనితీరుపై సంతృప్తిపడితే రెన్యువల్ చేసుకోవచ్చు లేదా మరో టెండర్ పిలుచుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ ఒకేసారి ఐదేళ్లు ఇవ్వడంలో నిబంధనలకు నీళ్లు వదిలారా అన్న అనుమానాలున్నాయి. వీసీ తాటికొండ రమేష్ పదవీ కాలం ఈ ఏడాది మే 23న పూర్తికాబోతుంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన యూనివర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆన్‌లైన్ స్క్రీన్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ కోసం అప్రూవల్ ఇచ్చారు. దీంతో వెనువెంటనే టెండర్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు సమాచారం.

ఇప్పటివరకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ

కేయూలో నాలుగేళ్లక్రితం పరీక్షల విభాగంలో పైలెట్ ప్రాజెక్టుగా ఆన్‌లైన్ స్క్రీన్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభించారు. గతంలో ఓయూలో ఏ సంస్థ అయితే ఈ ప్రక్రియ నిర్వహిస్తుందో దానికే అప్పగించారు. దీనిలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల జవాబుపత్రాల (32పేజీల స్క్రిప్ట్)ను ఆన్‌లైన్ స్కాన్ చేసి పంపుతున్నారు. అధ్యాపకులు కూడా ఆన్‌స్క్రీన్ ‘స్క్రిప్ట్ మూల్యాంకనం చేస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విధానాన్ని యూనివర్సిటీలోని అన్ని కోర్సులకు వర్తింపజేయనున్నారు.



తక్కువ కోట్ చేసినా రద్దు..

విద్యాసంవత్సరానికి సుమారుగా 25లక్షల స్క్రిప్టులు ఉంటాయని, వీటి డిజిటలైజేషన్ కోసం రూ.2కోట్ల విలువైన ఈ–టెండర్ ప్రక్రియను ఆహ్వానించారు. టెండర్ దక్కించుకునే సంస్థకు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు. ఓ సంస్థ ఒక్కోస్క్రిప్ట్‌కు (32పేజీలకు) రూ.14.51, మరో సంస్థ రూ.15, ఇంకో సంస్థ రూ.27.13 కోట్ చేసింది. ఇందులో తక్కువ (రూ.14.51) కోట్ చేసిన సంస్థకు టెండర్ ఖరారు చేయలేదు. ఆ టెండర్‌ను పూర్తిగా రద్దు చేశారు. ఎందుకు రద్దు చేశారనేది కూడా సంబంధిత సంస్థకు తెలియజేయలేదని సమాచారం. ఇలా ఉండగానే పరీక్షల నియంత్రణాధికారి మళ్లీ షార్ట్ టెండర్‌కు నోటిఫికేషన్ జారీచేశారు. తక్కువ కోట్‌చేసిన సంస్థ వారు విషయం తెలుసుకుని అవాక్కయ్యారు.

టెక్నికల్ సమస్యతోనే తొలి టెండర్ రద్దు

ఆన్‌స్క్రీన్ ఆన్సర్ షీట్ల స్క్రిప్ట్ వాల్యుయేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియ కోసం టెండర్ పిలిచాం. నాలుగు సంస్థలు ఈ–టెండరు దాఖలు చేయగా మూడు అర్హత సాధించాయి. గతంలో పీజీ కోర్సుల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలకే ఆన్‌స్క్రీన్ వాల్యుయేషన్ చేశాం. ఇప్పుడు యూజీ, పీజీ అన్ని కోర్సులు కూడా చేయబోతున్నాం. అందువల్ల పలు టెక్నికల్ సమస్యలున్నాయి. దీంతో రద్దుచేశాం. వాటిని కరెక్షన్ చేసి మళ్లీ షార్ట్ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చాం. ఇందులో అర్హత కలిగిన, తక్కువ కోట్ చేసిన సంస్థకే ఖరారు చేస్తాం.

- ప్రొఫెసర్ నర్సింహాచారి,
కేయూ పరీక్షల నియంత్రణాధికారి

ఇల్లు లేక టెంట్‌కింద మృతదేహం

- కొంతకాలంగా అనారోగ్యం.. వైద్యం చేయించే స్థోమత లేక మృతి
- కిరాయి ఇంటికి తీసుకెళ్తే యజమానులు అభ్యంతరం చెబుతారని భయం
- రోడ్డు పక్కన ఉంచి అంతిమ సంస్కారాలు



రోడ్డు పక్కన మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పరకాల: ఇల్లు లేని నిరుపేదలకు శభకార్యాలే కాదు..అశుభ కార్యాలకు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. పరకాల పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో అద్దెకు ఉంటున్న నిరుపేద మత్స్యకార్మికుడు గోల్కొండ మల్లికార్జున్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహం వేసేందుకు ఇంటి ముందు స్థలం లేదు. ఇంటిలోపల వేసుకుని యజమానులు అభ్యంతరం చెబుతారేమోనని కుటుంబ సభ్యులు భయపడ్డారు. పశువుల సంత సమీపంలోని రోడ్డు పక్కన టెంట్ ఏర్పాటు చేసి దానికింద మృతదేహాన్ని ఉంచారు. ఆ తరువాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. చేపలు అమ్మి జీవనం సాగించే మత్స్య కార్మికుడు మల్లికార్జున్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పట్టణ ప్రజలు, బంధువులు కోరారు. ‘మా నాన్న కొంతకాలంగా ఆరోగ్యం బాగా లేదు. ఆస్పత్రులు తిరగటానికి చాలా డబ్బులు ఖర్చు చేశాం. చేతిలో రూపాయి లేకుండా పోయింది. చివరికి ప్రాణం పోయింది’ అని కుమారుడు విక్రమ్ రోదిస్తూ తెలిపాడు.



మల్లికార్జున్(ఫైల్)

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ నరహరి

ఐనవోలు: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ నరహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నందనం గ్రామంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మండల అధ్యక్షుడు చాగంటి హన్మయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా నేషనల్ ధోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజకతో పాటు నరహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేషనల్ ధోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరికి ఖమ్మం పార్లమెంట్ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. గోపి మాట్లాడుతూ 2016 డిసెంబర్ 26న రజకుల సంక్షేమ పథకాలతో పాటు, ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని రేవంత్‌రెడ్డి మాట్లాడారని గుర్తుచేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్కూరి సంజీవ్‌రావు, రాష్ట్ర, జిల్లా నాయకులు చాపర్తి రాజు, అనిల్, గువ్వల శేఖర్, లొంక సుధాకర్, కళమ్మ, యాదమ్మ, లక్ష్మమ్మ, సట్ల స్వామి, కొల్లూరు రమేష్, చాగంటి యాదయ్య, నేరెళ్ల రాములు, రాజు, నాయకులు పాల్గొన్నారు.



యాదగిరికి టికెట్ కేటాయించాలని సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి : నాయిని

నయీంనగర్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. నయీంనగర్ వద్ద కరీంనగర్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో వరద ముంపు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వహించకుండా గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

‘రియాల్టీ’కి ఇసుక గండం

- క్వారీలో టన్నుకు రూ.375.. నగరంలో రూ.1,700కు పైగా విక్రయం
- వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరల పెంపు?
- గ్రేటర్, శివార్లలో నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం
- ఇళ్ల పనులు ఆపేస్తున్న పలువురు బిల్డర్లు, యజమానులు
- ఫలితంగా ఉపాధి కోల్పోతున్న మేస్త్రీలు, కూలీలు
- అధికారులు దృష్టి సారిస్తేనే నియంత్రణలోకి ఇసుక రేట్లు



చింతగట్టులో పనులు సగంలోనే ఆగిన ఇల్లు

సాక్షి, వరంగల్ :

చింతగట్టులో వినయ్ అనే బిల్డర్ 200 గజాల ఓపెన్ ప్లాట్‌లో ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకొని పనులు మొదలు పెట్టాడు. జనవరిలో దొడ్డు రకం ఇసుక టన్నుకు రూ.850 వెచ్చించాడు. మార్చిలో ఏకంగా అదే దొడ్డు రకం ఇసుకకు రూ.1,700 చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే నిర్మించిన ఒక అంతస్తులో ఇటుక పనులు చేద్దామంటే సన్న ఇసుక టన్నుకు రూ.2వేలు చెబుతున్నారు. దీంతో పనులు కొద్దిరోజులు నిలిపి వేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు ఒక లారీలో 30 టన్నుల ఇసుకకు రూ.25,500 అయితే.. ఇప్పుడదీ ఏకంగా రూ.51 వేలకు చేరింది.

.. ఇలా ఒక్క వినయ్‌కే కాదు గ్రేటర్ వరంగల్‌తో పాటు శివారు ప్రాంతాల్లో వందలాది ఇళ్లను కడుతున్న బిల్డర్లు, యజమానుల పరిస్థితి. అత్యవసరం ఉన్నవారు మాత్రం లారీ యజమానులు చెప్పిన ధర ప్రకారం ఇసుక కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. చాలామంది మాత్రం ధరలు తెలుసుకొని సైలెంట్ అవుతున్నారు. మరికొద్ది రోజులు వేచి చూస్తే రేట్లు తగ్గుతాయని పనులు నిలిపివేస్తున్నారు. ఇంకొందరు బిల్డర్లు ఇప్పటికే చేసుకున్న ఒప్పందం ప్రకారం భారమైనా వినియోగదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని పనులు కొనసాగిస్తున్నారు. సొంతంగా ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం కొన్నిరోజులు పనులు నిలిపివేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మేడారం జాతర సమయంలో లారీలకు ప్రవేశం ఉండదంటూ ఇసుక రేటు పెంచి విక్రయించిన యజమానులు.. జాతర తర్వాత కూడా కూడా అదేరేటుతో విక్రయిస్తున్నారు. అయితే ఈసారి విచిత్రం ఏమిటంటే మేడారం జాతర సమయంలో దొడ్డు రకం టన్ను ఇసుకకు రూ.1200, సన్నరకం రూ.1500కు లభించేది. ఇప్పుడది ఏకంగా మరో రూ.300 నుంచి రూ.500 వరకు పెరగడం నిర్మాణదారులను విస్మయానికి గురిచేస్తోంది.

లారీ ఇసుకకు రూ.22వేలు అదనం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో మల్లారం, తాడిచర్ల ఇసుక క్వారీలు ఉన్నాయి. తాడిచర్లకి ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ నిలిపివేశారు. మల్లారం (చిన్న ఓదెల), పలుగుల 5, మద్దులపల్లి (పలుగుల 7), పలుగుల 6, పలుగుల (గుండ్రాత్‌పల్లి)తోపాటు ములుగు జిల్లాలోని చాలా రీచ్‌ల నుంచి ఇసుక వస్తోంది. అయితే ఒకటి, రెండు క్వారీలు నిలిపివేయడంతో అదే బూచీ చూపి ఇసుక వ్యాపారులు ఒక లారీ ట్రిప్పు కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఎండీసీ) ద్వారా ఆన్‌లైన్‌లో డీడీలకు టన్నుకు రూ.375 గతంలో మాదిరిగానే చార్జ్ చేస్తోంది. కానీ, ఇసుక వ్యాపారులు మాత్రం అదే టన్ను ఇసుకను వరంగల్‌లో ఏకంగా రూ.1,700కుపైనా విక్రయిస్తున్నారు. ఒక లారీలో 26 మెట్రిక్ టన్నులు లోడ్ అయితే రూ.పదివేల లోపు అవుతోంది. అదే లోడ్ లారీ వరంగల్‌కు వచ్చేసరికి రూ.44వేలు అవుతుండడం గమనార్హం. లోడ్ లారీకి రూ.10 వేలు, రవాణా ఖర్చు రూ.10వేలు.. వీటికి అదనంగా మరో రెండు వేలు లెక్కించినా రూ.22 వేలు అవుతోంది. అంటే ఈ లెక్కన ఒక్కో లారీకి రూ.22వేలు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఇసుక వ్యాపారులే సిండికేట్ అయి ధరలు పెంచుతున్నారన్న విమర్శలున్నాయి. జనవరి వరకు నిలకడగా ఉన్న ధరలు ఒక్కసారిగా పెరగడం వెనుక ఉన్న మతలబు ఏమిటన్న చర్చ ఉమ్మడి వరంగల్ ప్రజల్లో సాగుతోంది.

టీఎస్‌ఎండీసీ అధికారులు నజర్ పెట్టాలి..

ఏదైనా నగరం అభివృద్ధి చెందాలంటే రియాల్టీ రంగం దూసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ రంగానికి కీలకమైన ఇసుక ధరను వ్యాపారులు కొండెక్కించడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అడ్డగోలుగా ఇసుక రేట్లు పెంచడం వెనుక ఉన్న మతలబు ఏమిటన్న చర్చ జోరుగా సాగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిలకడగా ఉన్న ఇసుక ధరను ఇప్పుడు రెట్టింపు చేసి విక్రయిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో నిర్మాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై టీఎస్‌ఎండీసీ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రియాల్టీ రంగానికి ఊతమివ్వాలి..

ఉమ్మడి వరంగల్ నుంచి మంత్రులుగా ఉన్న కొండా సురేఖ, సీతక్క కలుగజేసుకొని రియాల్టీ రంగానికి ఊతమివ్వాలి. ఇసుక ధరను నియంత్రించకపోతే రియాల్టీ రంగానికి గడ్డుకాలం దాపురిస్తుంది. ఈ రంగంపై ఆధారపడి వేలాదిమంది మేస్త్రీలు, కార్మికులు, కూలీలు పనిచేస్తున్నారు. పనులు ఆపేస్తే అది వారి జీవనంపై ప్రభావం చూపుతుంది.

- రఘు, బిల్డర్

ముగిసిన నామినేషన్ల పర్వం

- హనుమకొండ బార్ ఎన్నికల అభ్యర్థుల తుది జాబితా విడుదల
- ఐదు స్థానాలు ఏకగ్రీవం

వరంగల్ లీగల్: ఈనెల 28న హనుమకొండ బార్ అసోసియేషన్ ఎన్నికల నేపథ్యంలో గురువారం నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. అనంతరం ఎన్నికల పరిశీలకులు తుది జాబితాను ప్రకటించారు. అధ్యక్షుడి బరిలో ఎం.రమేష్‌బాబు, పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడి స్థానానికి పి.రఘుపతి, ఎస్.రాజన్‌బాబు, పి.రవీందర్, ఎస్.యుగేందర్, జనరల్ సెక్రెటరీ స్థానానికి వి.నరేందర్, పి.నవీన్‌కుమార్, ఎల్.రమేష్, బి.శంకర్, ఆర్.వేణుగోపాల్, జాయింట్ సెక్రెటరీ (మహిళ) వి.పద్మ, జె.స్వప్న, జాయింట్ సెక్రెటరీ స్పోర్ట్స్ / కల్చరల్ పి.చిరంజీవి, ఎం.మహేష్ పటేల్, సి.మల్లేష్, కోశాధికారిగా జి.సదానందం, పి.సమ్మిరెడ్డి, ఎ.శివశంకర్, ఈసీ మెంబర్లుగా (4 స్థానాలకు) వి.అచ్యుత్‌కుమార్, జి.అనిల్ లాల నాయక్, ఈ.చంద్రశేఖర్, సీహెచ్ నిఖిల్‌కుమార్, వి.రమేష్, కె.రుత్విక్, ఎ.సందీప్‌కుమార్, ఎస్.సుహాస్, డి.సునిల్ కుమార్, ఈసీ మెంబర్లు (మహిళా) జి.రమాదేవి, కె.ఉషాలు బరిలో నిలిచారు. అదేవిధంగా వరంగల్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గురువారం నామినేషన్లు పర్వం ముగిసింది. శుక్రవారం ఉపసంహరణ అనంతరం సాయంత్రం తుది జాబితాను ప్రకటించనున్నారు.

ఐదు స్థానాలు ఏకగ్రీవం...

హనుమకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఐదు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీరిలో జాయింట్ సెక్రెటరీగా ఎం.విజేందర్, జాయింట్ సెక్రెటరీగా (లైబ్రరీ) బి.సంపత్, ఈసీలుగా జి.సురేందర్‌రెడ్డి (30 ఏళ్లు), టి.శ్రీనివాస్ (20ఏళ్లు), మహిళ కింద ఎస్.అనిత (10 ఏళ్లు) ఉన్నారు.

ప్రతి నర్సరీలో వందశాతం మొక్కలు పెంచాలి

శాయంపేట: ప్రతి గ్రామంలోని నర్సరీలో వందశాతం మొక్కలు పెంచాలని డీఆర్‌డీఓ నాగపద్మజ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి 100మంది కూలీలతో ఉపాధి హామీ పనులు చేయించాలని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 150మంది చొప్పున పనులు చేయించాలని అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సహకారంతో మండలాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అడిషినల్ డీఆర్‌డీఓ శ్రీనివాసారావు, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ అనిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగపద్మజ

క్లుప్తంగా

'యశోద'లో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ

● డాక్టర్ సునీల్ దాచేపల్లి



రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ గురించి వివరిస్తున్న డాక్టర్ సునీల్

హన్మకొండ చౌరస్తా: హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ కీహోల్ సర్జరీలు ఇప్పటి వరకు 400లకు పైగా విజయవంతంగా చేశానని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. హనుమకొండలోని అశోకా హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లండన్‌లో పదేళ్ల ప్రత్యేక శిక్షణ పొంది 2014 నుంచి భారత్‌లో సర్జరీలు చేస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి యూకేలోని వైటింగ్టన్ హాస్పిటల్ యాజమాన్యం బంగారు పతకంతో సన్మానించిందన్నారు. చాలా మందిలో మోకాళ్ల అరుగుదల సాధారణంగా మారిందని, నొప్పులను భరించలేక కొందరు ఇంజక్షన్ వేసుకుని వదిలేస్తున్నారని, తప్పనిసరిగా సర్జరీ చేసుకోవాలని సూచించారు. రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్లలో పరికరాలను కచ్చిత పద్ధతిలో అమర్చొచ్చన్నారు. ఈ సందర్భంగా సర్జరీ చేసుకున్న వృద్ధురాలితో మాట్లాడించారు.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

చిట్యాల: ఆటో బోల్తాపడి ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన గోపగాని శోభ, వసంత, పద్మ, సమ్మక్క ఆటోలో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో వెంకట్రావుపల్లి (సి) అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఓ చిన్నారి రోడ్డు దాటుతోంది. పాపను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారితో పాటు ఆటో డ్రైవర్ అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు.

చీట్‌ఫండ్..

ప్రజల సొమ్మును వెంచర్లలోకి దారిమళ్లిస్తున్న నిర్వాహకులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో కనుమరుగవుతున్న చిట్స్ బిజినెస్
- రూ. 100 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పడిపోయిన టర్నోవర్
- బోర్డు తిప్పేసిన 9 చిట్‌ఫండ్ కంపెనీలు.. అదే బాటలో మరికొన్ని..
- అధికారుల పర్యవేక్షణ కరువు.. పీఎస్ మెట్లు ఎక్కుతున్న బాధితులు



కాజీపేట అర్బన్ : భవిష్యత్ అవసరాల నిమిత్తం చిన్న మొత్తంలో ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్‌ఫండ్ నిర్వాహకులు దారిమళ్లిస్తున్నారు. చిట్‌ఫండ్ బిజినెస్‌లో లాభాలు రాకపోవడంతో ప్రజలకు కుచ్చుటోపి పెట్టి వారు నెలనెలా పొదుపు చేసుకుంటున్న సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్‌వెస్ట్ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సొమ్మును తిరిగి చెల్లించమని ఖరాఖండి చెబుతున్నారు. పైగా బలవంతంగా ప్లాట్ అంటగడుతున్నారు. ఒకవేళా వద్దంటే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు తమ నెలసరి ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేసి ఆర్థిక అవసరాలకు వినియోగించుకునేందుకు చిట్స్ వైపు ఆసక్తి కనబరుస్తారు. ఈ క్రమంలో ప్రైవేట్ చిట్స్‌తో తమ సొమ్ముకు భద్రత ఉండదని భావించి ప్రభుత్వం ఆమోదం పొందిన రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో దొందూదొందే అన్న చందంగా ప్రైవేట్ చిట్ యజమాని రాత్రికి రాత్రే ప్రజల సొమ్ముతో పరారీ అవుతుండగా.. ప్రభుత్వ ఆమోదం పొందిన చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేసి చిట్ డబ్బులు ఇవ్వక ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఫలితంగా చిట్స్ కంపెనీలు చీటింగ్‌తో ఓ వైపు.. అధికారులు స్పందించకపోవడంతో మరో వైపు బాధితులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 262 బ్రాంచ్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 262 బ్రాంచ్‌లతో వివిధ రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు కొనసాగుతున్నాయి. వీటిలో 150కి పైగా సింగిల్ ఓనర్ అనగా బ్రాంచ్‌లు లేకుండా తమ చిట్స్ బిజినెస్ నడిపిస్తున్నాయి. కాగా రెండేళ్లుగా చిట్స్ కంపెనీలు తమ లావాదేవీలు నిలిపివేస్తూ వెంచర్‌లపై మక్కువ కనబరుస్తున్నాయి. దీంతో రాబోవు రోజుల్లో చిట్స్ కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు. గతంలో ప్రతి ఏడాది చిట్స్ కంపెనీల టర్నోవర్ రూ. 100 కోట్లపై బడి ఉండగా ప్రస్తుతం రూ. 15 కోట్లకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం.

అధికారుల పర్యవేక్షణ కరువు..

వరంగల్ ఆర్వో కార్యాలయంలోని చిట్స్ సహాయ రిజిస్ట్రార్ బాధితులకు భరోసానివ్వకపోవడం.. చిట్ ఫండ్ కంపెనీలపై పర్యవేక్షణ కొనసాగించకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రీవెన్స్ మాదిరి జిల్లా రిజిస్ట్రార్‌కు ప్రతి సోమవారం పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయంటే చిట్స్ చీటింగ్ ఎలా ఉందో తెలుస్తోంది.

బోర్డు తిప్పేసిన 9 కంపెనీలు.. ఎఫ్‌డీల ఫ్రిజ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే 9 చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేసి సభ్యులకు తమ సొమ్ము ఇవ్వకుండా చేతులు ఎత్తేశాయి. అదే బాటలో మరి కొన్ని కంపెనీలు పయనిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అక్షర, కనకదుర్గ, శుభనందిని, అచల వంటి కంపెనీల ఫిక్స్‌డ్ డిపాజిట్లను బ్యాంకుల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఫ్రిజ్ చేశారు. కాగా, ఫ్రిజ్ చేసిన సొమ్మును తమకు ఇవ్వాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా తమ సొమ్ము చెల్లించకపోవడంతో అక్షర చిట్ ఫండ్ ఖాతాదారులు ఆరు నెలల క్రితం సంఘం ఏర్పడ్డారు. అనంతరం చిట్‌ఫండ్ కంపెనీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు తమ స్థిరాస్తులు విక్రయించైనా ఇస్తామని చెప్పి నేటికీ చెల్లించలేదు. దీనిపై అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఖాతాదారులు లబోదిమంటున్నారు.

పీఎస్ మెట్లు ఎక్కుతున్న బాధితులు..

తమకు జవాబుదారీగా నిలుస్తారనుకున్న అధికారులతో విసిరివేసారిన చిట్స్ బాధితులు.. పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. ఇందులో భాగంగా గతంలో వరంగల్ పోలీస్ కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో చిట్‌ఫండ్ కంపెనీల యాజమాన్యంతో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సొమ్ము చెల్లించాలని తెలిపిన ఫలితం లేదు. పైగా తమ వెంచర్‌లో తక్కువ ధరకే ప్లాట్లు ఉన్నాయని, వీటిని తీసుకోవాలనే ఒత్తిడి మొదలైంది.

బడుగులకు విద్య అందకుండా కుట్ర

- భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ గోపీనాథ్



మాట్లాడుతున్న గోపీనాథ్

కేయూ క్యాంపస్: బడుగు, బలహీనవర్గాలకు విద్య అందకుండా పాలకవర్గాలు చేస్తున్న కుట్రే నూతన జాతీయ విద్యావిధానమని భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ అన్నారు. గురువారం కేయూలోని బాటనీ విభాగం సెమినార్ హాల్‌లో నూతన జాతీయ విద్యావిధానంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వేల ఏళ్లనాటి మనుస్మృతిని అమలు చేయడం కోసమే మనువాద పాలకులు ఈ నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు దీనిని వ్యతిరేకించాలన్నారు. రిటైర్డ్ ఆచార్యుడు మార్క శంకర్‌నారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగపు వెలుగులో నూతన జాతీయ విద్యా విధానం లేదని, హక్కులు ముచ్చట కరువైందన్నారు. సామాజిక న్యాయం అనే మాట అరవై ఆరు పేజీల ఎన్ఈపీ 2020లో లేదన్నారు. విద్యను ప్రైవేటు పరం చేసే దిశగానే వెళ్తుందన్నారు. అంతేగాకుండా అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే, పెరియార్‌లాంటి మహనీయుల ఆలోచన పరంపరలేదన్నారు. ఈ సదస్సుకు కేయూ విద్యార్థి నాయకుడు శ్రావణ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎం వెంకట్‌రెడ్డి, మున్నా గణేష్, సత్యం,శివ, అనిల్ మాట్లాడారు. సామాజిక స్పృహతో కేయూ విద్యార్థులు నూతన జాతీయ విద్యావిధానం రద్దుచేయాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఈసదస్సు నిర్వహించినట్లు వారు తెలిపారు.

సీపీఈ సెమినార్‌లో వరంగల్ సీఏలు



ఐసీఏఐ అధ్యక్షుడు రంజిత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సీఏ పీవీ నారాయణరావు

వరంగల్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ ఎకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో బ్యాంక్ ఆడిట్స్‌పై హైదరాబాద్‌లో గురువారం సీపీఈ సెమినార్ నిర్వహించారు. ఒక్క రోజు నిర్వహించిన సెమినార్‌లో వరంగల్, కరీంనగర్‌కు చెందిన సీఏలు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో ఐసీఏఐ అధ్యక్షులు సీఏ రంజిత్‌కుమార్, వరంగల్ బ్రాంచ్ మాజీ అధ్యక్షులు సీఏ పీవీ నారాయణ రావు, వరంగల్ అధ్యక్షుడు సీఏ భగవాన్ దాస్ ముందాడ, కార్యదర్శి సీఏ మాదారపు సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ సినిమాను ఆదరించండి

- చిత్ర దర్శకుడు సత్యనారాయణ
- మానుకోటలో చిత్రయూనిట్ సందడి



మాట్లాడుతున్న నటి అనసూయ

మహబూబాబాద్ అర్బన్: రజాకార్.. మత, గత చరిత్ర, వివిధ పార్టీలకు సంబంధించిన సినిమా కాదని, తెలంగాణ చరిత్రకు సంబంధించిందని చిత్ర దర్శకుడు యాటా సత్యనారాయణ అన్నారు. గురువారం రజాకార్ చిత్ర విజయోత్సవ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని లక్ష్మి థియేటర్‌లో నిర్వహించగా చిత్రయూనిట్, నటీ, నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సత్యనారాయణ, సంగీత దర్శకుడు భీమ్స్ మాట్లాడుతూ.. మన తెలంగాణ చరిత్రను పట్టించుకోవాలని, గ్రూప్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఈ రజాకార్ సినిమా చూడాలని, ఇందులో నుంచి సుమారు 10 ప్రశ్నలు రావొచ్చన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ, ఖిలా వరంగల్, పరకాలలో మొదటి సారి జెండా ఎగరవేయడం వంటి కథనం, చరిత్ర ఆధారంగా ఈ సినిమాను చిత్రీకరించామని, దీనిని ఆదరించాలన్నారు. అనంతరం నటి అనసూయ మాట్లాడుతూ.. మానుకోట బిడ్డ భీమ్స్ రజాకార్ సినిమాకు మంచి సంగీతం అందించారని, ఈ సినిమాను తెలంగాణ ప్రజలందరూ ఆదరించాలన్నారు. తెలంగాణ బతుకమ్మ గురించి, మన సంప్రదాయాలకు అద్దంపట్టేలా సినిమా తీశామన్నారు. అనంతరం యూనిట్ సభ్యులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు రాజు అర్జున్, గూడూరు నారాయణ రెడ్డి, శ్రీగిరి, శివం, రమణ, బలగం సత్యనారాయణ,అంజిరెడ్డి, ప్రముఖ వైద్యులు వీరన్న, రంజిత్ రెడ్డి, లక్ష్మి థియేటర్ మేనేజర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: మండలకేంద్రంలో గురువారం 'రజాకార్' సినిమా యూనిట్ సందడి చేసింది. రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించి ప్రాణాలర్పించిన అమరుల చిహ్నంగా బయ్యారంలో నిర్మించిన అమరవీరుల స్తూపం వద్ద నివాళలర్పించింది. ఈ సందర్భంగా మండలవాసి, సినిమా సంగీత దర్శకుడు భీమ్స్‌సిసోడియా మాట్లాడారు. రజాకార్ సినిమాను ప్రతిఒక్కరూ చూడాలన్నారు. బయ్యారానికి చెందిన గాయకుడు, నటుడు వీరన్న చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు, కార్యక్రమంలో యూనిట్ సభ్యులు అనసూయ, శ్రీగిరి, శివం, రమణ, సత్యనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మందులు విక్రయిస్తున్న ఫార్మసిస్టు అరెస్టు

- రూ. 80,844 విలువైన ఔషధాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ ఔషధాలు

ఎంజీఎం : ప్రభుత్వ మందులు విక్రయిస్తున్న వరంగల్ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు నాగేందర్‌ను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు గురువారం డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్, ఇంతేజార్ గంజ్ పోలీసులు.. కాశిబుగ్గలోని నాగేందర్ ఇంటిని తనిఖీ చేశారు. ఈ సమయంలో ఇతర వ్యక్తికి ప్రభుత్వ మందులు అమ్ముతూ నాగేందర్ ప్రత్యక్షంగా పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. నాగేందర్ కొన్ని సంవత్సరాల నుంచి వైద్యుల ప్రిస్కిప్షన్ కంటే ఎక్కువ స్టాక్ చూపిస్తూ ఆస్పత్రిలో మందులు కాజేసి తనకు పరిచయమున్న బలరాందాసుకు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన బలరాం దాసు ప్రభుత్వ ఔషధాలను ఇతర మందుల షాపులకు విక్రయిస్తున్నాడు. ఈ దాడుల్లో రూ. 69,360 విలువైన అమాక్సిలిన్ పొటాషియం క్యాల్‌వెంట్, రూ.11,484 విలువైన ఐ డ్రాప్స్‌ను స్వాధీనం చేసుకుని డ్రగ్ కంట్రోల్ అధికారులు పంచనామా నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడీ రాజ్యలక్ష్మి, డ్రగ్ డీఐ కిరణ్, ఇంతేజార్ గంజ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గుప్త నిధులకోసం గొయ్యి తీస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు



గుప్తనిధుల కోసం తీసిన గొయ్యి

- మల్లూరు గుట్టపై ఘటన
- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు?

మంగపేట : మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పరిసరాల్లో గుప్త నిధుల కోసం పది మంది గల ముఠా కొంత కాలంగా తవ్వకాలు జరుపుతోంది. ఈ క్రమంలో ఆలయ పరిసరాల్లోని చింతామణి జలపాతం సమీపం దేవునికుంటలోని మైసమ్మ రాతి విగ్రహం వద్ద గురువారం కొందరు.. స్థానికుల సహకారంతో క్షుద్రపూజలు నిర్వహించి తవ్వకాలు జరుపుతున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు ఎస్సై గోదరి రవికుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. ఆలయ రికార్డ్ అసిస్టెంట్ గోనె లక్ష్మీనారాయణకు చెందిన దేవునికుంట చేనులో కొందరు తవ్వకాలు జరుపుతున్నారు. ఈవిషయం తెలుసుకుని అతడు అక్కడికెళ్లి ప్రశ్నించగా ముఠా సభ్యులు దాడికి యత్నించారు. దీంతో లక్ష్మీనారాయణ వెంటనే ఎస్సైకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఎస్సై అక్కడకు చేరుకోవడాన్ని గమనించి ముఠా సభ్యులు ద్విచక్రవాహనాలను వదిలేసి పరారయ్యారు. ఓ వ్యక్తి పట్టుబడగా అదుపులోకి తీసుకుని విచారించారు. తమను గుప్త నిధుల తవ్వకాల కోసం అటవీశాఖ అధికారి, మల్లూరుకు చెందిన శివరాత్రి వెంకన్న పిలిపించారని పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. తవ్వకాలు జరిపిన వారిలో ఇద్దరు మహిళలు, మరో 8 మంది ఉన్నట్లు సమాచారం. పోలీసులు స్వాధీనం చేసుకున్న నాలుగు ద్విచక్రవాహనాల్లో అటవీశాఖ మల్లూరు బీట్‌ఆఫీసర్ విజయరావు, మల్లూరుకు చెందిన శివరాత్రి వెంకన్నకు చెందిన రెండు ద్విచక్రవాహనాలు ఉండడం వారితో పాటు మరికొందరు స్థానికుల ఆధ్వర్యంలో గుప్త నిధుల తవ్వకాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఘటనా స్థలిలో అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసుల ఆధీనంలో మొత్తం నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై రవికుమార్‌ను వివరణ అడగగా పరారైన వారికోసం గాలిస్తున్నామని, పట్టుకున్న అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- 2 కార్లు, 11 మోటార్లు, 57 కిలోల కాపర్ వైర్ స్వాధీనం



నిందితుల అరెస్ట్‌తోపాటు స్వాధీనం చేసుకున్న మోటార్లను చూపుతున్న పోలీసులు

పరకాల: విద్యుత్ మోటార్ల చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు కార్లతోపాటు 11 మోటార్లు, రూ. 34వేల విలువైన కాపర్ వైర్, రూ.40వేల నగదు స్వాధీనం చేసుకుని ఓ బాలుడితో సహా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పరకాల పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్ల రవీందర్ వివరాలు వెల్లడించారు. పరకాల పోలీసులు నడికూడ చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లు అనుమానస్పదంగా కనిపించాయి. వాటిని తనిఖీ చేయగా వ్యవసాయ బావులకు సంబంధించిన కాపర్ వైర్ లభ్యమైంది. దీంతో కార్లలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అంతర్ జిల్లా దొంగలుగా తేలింది. హనుమకొండలోని అమరావతినగర్‌కు చెందిన మెకానిక్ బండారి అనిల్ విలాస జీవితానికి అలవాటుపడి ఓ బాలుడితోపాటు భూపాలపల్లి జిల్లా టేకుమట్లకు చెందిన మాటూరి అరవింద్, మొగుళ్లపల్లి మండలం కొరికిశాలకు చెందిన సరిగొప్పుల సాయితేజ, కమలాపురం హరీష్‌ను మోటార్ల చోరీలకు ప్రోత్సహించాడు. దీంతో ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి మూడు నెలల నుంచి పరకాల, మొగుళ్లపల్లి, దామెర, ఇల్లంతకుంట మండలాలోని ఎస్సారెస్పీ కెనాల్ బావుల వద్ద ఉన్న మోటార్లను చోరీ చేశారు. అనంతరం మోటర్ల నుంచి కాపర్ వైర్ వేరు చేసి హుజూరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి వెళ్తుండగా నడికూడ వద్ద పట్టుబడినట్లు తెలిపారు. నిందితులు ప్రయాణిస్తున్న రెండ్లు కార్లు, నాలుగు సెల్ ఫోన్లు, 57కిలోల కాపర్ వైర్, రూ. 40వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ రవిరాజు, ఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు టి.భాస్కర్, జి.కృష్ణకుమార్, డి.దేవేందర్, డి.నాగరాజు, కె.నాగరాజు, వి.భాస్కర్, హోంగార్డు సుధాకర్, ఎం.రామన్న, పి.రవీందర్‌ను డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్‌కుమార్ అభినందించారు.

అర్హుల ఆనందహేళ..

- ఎన్పీడీసీఎల్ పరిధిలో 'గృహజ్యోతి' బిల్లు రూ.55.56 కోట్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.11.65 కోట్లు



హన్మకొండ : టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో గృహజ్యోతి ద్వారా మొదటి విడతలో 19 లక్షల 70వేల మంది రూ.55.55 కోట్ల మేర లబ్ధి పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,39,563 మంది వినియోగదారులు జీరో బిల్లుల ద్వారా రూ.11.65 కోట్ల మేర లబ్ధి పొందారు. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు చెల్లించనుంది. గృహజ్యోతి నిబంధనల ప్రకారం ప్రతి నెల 15వ తేదీలోపు బిల్లులు జారీ చేయాలి. ప్రస్తుత నెలలో జీరో బిల్లు ద్వారా రావాల్సిన మొత్తాన్ని మరుసటి నెల 20వ తేదీలోపు ప్రభుత్వానికి నివేదిక పంపాలి. ప్రభుత్వం ఈ రాయితీ మొత్తాన్ని డిస్కంకు చెల్లిస్తుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్.. తన పరిధిలో 15వ తేదీ లోపు బిల్లులు జారీ చేసింది. ప్రభుత్వానికి మరుసటి నెల వివరాలు పంపాల్సి ఉన్నప్పటికీ ఏ రోజు సమాచారం అదే రోజు పంపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో మొదటి విడతలో అర్హత సాధించిన గృహజ్యోతి సర్వీస్‌లు 4,50,923 ఉన్నాయి. ఇందులో 4,47,729 సర్వీస్‌లకు బిల్లులు జారీ అయ్యాయి. 4,39,563 మంది విద్యుత్ వినియోగదారులు 200 లోపు యూనిట్లు విద్యుత్ వినియోగించడంతో వీరికి జీరో బిల్లులు జారీ చేశారు.

వినియోగదారుల వివరాలు.. (జీరో బిల్లు మొత్తం రూ.కోట్లలో)

జిల్లా	మొత్తం కన్జూమర్స్	గృహజ్యోతి కన్జూమర్స్	బిల్లుల జారీ	జీరో బిల్లు	జీరో బిల్లు మొత్తం
హనుమకొండ	3,45,302	1,02,156	102156	98483	3.06
వరంగల్	2,86,156	1,02,836	102804	99477	2.88
భూపాలపల్లి, ములుగు	93,257	77250	74094	75109	1.82
జనగామ	1,69,375	78655	78655	77829	1.77
మహబూబాబాద్	2,09,066	90026	90020	88665	2.11



ప్రజలను వంచించిన కేసీఆర్



మాట్లాడుతున్న జంగా రాఘవ రెడ్డి

కాజీపేట : తెలంగాణ ప్రజలు కేసీఆర్ మాయమాటలు నమ్మి పదేళ్ల అధికారం అప్పగిస్తే కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకోవడంతో పాటు అప్పుల కుప్పగా మార్చారని రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి విమర్శించారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేసి ఇంటికి పంపించారన్నారు. అయితే ఇదీ జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందడం కోసమే కాంగ్రెస్ పాలనపై ఆరోపణలు చేస్తున్నారని, ఇది మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సుంచు చంద్రయ్య, తోట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ రఘుచందర్, గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్‌యాదవ్, కూర్ల మోహన్, బైరి లింగమూర్తి, విజయ్ కుమార్, ఇమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



మోహినోద్దీన్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో చిరు వ్యాపారులను దృష్టి మరల్చి వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ వరంగల్‌లోని పుప్పాలగుట్ట చింతల్‌కు చెందిన సయ్యద్ యాకుబ్ మోహినోద్దీన్‌కు ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కిరాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. దుకాణం ఆశించిన స్థాయిలో నడవకపోవడంతో పాటు కుటుంబ అవసరాలు పెరిగాయి. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చిరు వ్యాపారులను దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గొర్రె నాగరాజు అనే వ్యక్తి దుకాణంలో రెండు రోజుల క్రితం చోరీకి పాల్పడగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి కడిపికొండ బ్రిడ్జి సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ చెప్పారు.